అనగనగా ఓ మంచి కథ

# అంగడిబొమ్మ

- ఉత్పల వరదరాజా

(ఆంధ్రప్రభ వారపత్రిక ఆగస్ట్ 8' 84)



**అది అంగడి.**

అక్కడ శరీరం అమ్మకానికి సిద్ధంగా ఉంది.

అందాన్ని బట్టీ ఖరీదు. అక్కడ ఉన్న అందానికి ప్రత్యేకమయిన పేరుంది. వారి అందాన్ని నీతి పదాలతో వర్ణించరు.

వాణీనాథం తలెత్తి అందరివైపు చూశాడు. అలా చూడటంలో వారిలో ఏ ఒక్కరి అందం మీద శ్రద్ధలేదు తనకు. అసలు తనకు కావలసింది వారి అందం. అవయవ సౌష్టవం కాదు. తనకు అద్దె భార్యగా ఉండే అమ్మాయికావాలి. అయితే, ఆ అమ్మాయి తన ముఖాన్ని చూసి అసహ్యించుకోకూడదు. అలా అని ప్రేమించనవసరంలేదు.

"మీకే అమ్మాయి కావాలో తీసుకెళ్ళండి."

వాణీనాథం ఏ అమ్మాయి వైపూ నిశితంగా చూడలేకపోయాడు. అందుకు కారణం, తన ముఖాన్ని చూస్తున్న యువతులు చూపులు తప్పించేసుకున్నారు.

ఒక యువతిపై వాణీనాథం చూపు నిలిచింది.

వినయంగా నిలబడి ఉంది.

ఆమె ముఖంలో వేశ్య లక్షణాలు కనిపించటంలేదు. ఆమె అసలు అక్కడ ఉండవలసింది కాదు. లలాట లిఖితం.

"నీ పేరు?" ఆ యువతిని ప్రశ్నించాడు.

"వసుంధర" శ్రావ్యమయిన కంఠం.

"నాతో పదిరోజులు గడపటానికి నీకేదయినా అభ్యంతరమా?" వాణీనాథం అడిగాడు.

"లేదు.. వస్తాను" అందామె.

వారందరికి యజమానురాలు ఉంది. ఆ యజమానురాలికి ఒప్పందం ప్రకారం డబ్బు ఇచ్చి బయలుదేరాడు వాణీనాథం ఆమె చిన్న చేతి సంచితో అనుసరించింది.

వాణీనాథం కారు తలుపు తెరిచి "కూర్చో" అన్నాడు.

వసుంధర మౌనంగా కూర్చుంది.

కారు నగరం మధ్య సాగిపోతోంది.

ఒకచోట కారు ఆపాడు వాణీనాథం. పర్సులో నుండి మూడువంద రూపాయల నోట్లు తీశాడు. "వసూ" అంటూ అతని ముఖంలోకి చూసింది. అతను ముఖం తిప్పుకుని, "నీకు నచ్చిన రెండు చీరెలు తీసుకో" అన్నాడు.

వింతగా చూసింది వసుంధర.

"డబ్బు సరిపోకపోతే ఇస్తాను" ఇవ్వబోయాడు.

"వద్దు.. చాలండి"అంది.

"చూడు చీరలు మాత్రమే. లంగా, బ్రాసియర్, రవిక వేరే చోట తీసుకుందాం" అన్నాడు.

వసుంధర రెండు చీరెలు కొని తీసుకువచ్చింది. మిగిలిన ఇరవై ఇవ్వబోయింది. "ఉంచు" అంటూ కారు స్టార్ట్ చేశాడు. కారు ముందుకు సాగింది. మరోచోట ఆపాడు కారు.

వసుంధరతో తనూ దిగాడు.

టాయిలెట్ సామగ్రి, లంగా, బ్రాసియర్, జాకెట్‌లు తనే స్వయంగా కొన్నాడు. కారులో ఎక్కబోతుండగా "నీవు చాలా పొదుపుగా కొన్నావు చీరలు. అందుకే ఇవి నేను కొన్నాను" అన్నాడు వాణీనాథం.

వసుంధర అదోలా నవ్వింది.

కారు కొద్ది నిమిషాలలో ఒక భవనం ముందు ఆగింది. చుట్టూ పెద గార్డెన్. రెండంతస్తుల ఆ భవంతి ఆధునికంగా, అపురూపంగా ఉంది.

కారు భవనం కాంపౌండ్‌లో ప్రవేశించింది.

విప్పారిన కళ్ళతో వింతగా చూసింది వసుంధర.

వాణీనాథం, వసుంధరా లోపలకు నడిచారు.

ఆ భవనంలో ఉన్న దాదాపు నలుగురు నౌకర్లు వచ్చి నిలబడ్డారు ."ఈమె పేరు వసుంధర. నా తరువాత ఈ ఇంట్లో మీరు గౌరవించవలసిన స్త్రీ ఈమె. ఆమె ఇక్కడ పదిరోజులు ఉంటుంది. ఈ పదిరోజులు ఏవిధంగానూ ఆమెకు కష్టం కలిగించకూడదు. రా వసుంధరా" అంటూ మేడమీదకు తీసుకువెళ్ళాడు.

పై భాగంలో ఒక గదిలోనికి తీసుకువెళ్ళాడు. సోఫా సెట్టు. ఒకవైపు టి.వి కూడా ఉంది. "ఈ గది నీది. ఇది టి.వి. ఏం తోచనప్పుడు ఇక్కడ కూర్చోవచ్చు"

మరో గదిలోనికి నడిచాడు. "ఇది బెడ్ రూం.. నీ బెడ్ రూం" అన్నాడు.

వసుంధర అప్పటికే మతిపోయిన దానిలా చూస్తూంది. "వసూ! జీవితం చాలా చిత్రమైంది. వెతక్కపోయినా, కొందరికి బంగారు తీగె దొరుకుతుంది. కొందరు మనకెందుకులే అనుకుంటే, చాటుగా ఉండి త్రాచులా కాటు వేస్తారు. నేను నీవు ఊహించిన సుఖం ఇవ్వడానికి ఇక్కడకు తీసుకురాలేదు."

వసుంధర వింతగా చూసింది.

"చాలామంది మగాళ్ళు నిన్ను ఉపయోగించుకుంటారు. నీవు వారికి ఉపయోగపడతావు. కాని, ఈ రెండూ నాకవసరంలేదు. నిన్ను ఎందుకు తీసుకువచ్చాననేది నీ ప్రశ్న కావచ్చు. నా అంత అందవికారమయిన వ్యక్తి ఈ సృష్టిలో లేడని భావిస్తాను. నన్ను హింసించిన బ్రూట్స్, రాస్కెల్స్ చాలామంది ఉన్నారు. అలాగే అమ్మాయిలు కూడా. అందరికంటే వింతయిన వ్యక్తి మా మరదలు మీనాక్షి" బరువుగా ఊపిరి వదిలాడు వాణీనాథం.

అతనివైపు ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది వసుంధర.

వాణీనాథం తెల్లబట్టలు తొడిగి ఆటకు వదిలిన ఎలుగుబంటిలా ఉంటాడు. పైగా మశూచితో గుంటలుపడ్డ ముఖం. ఎత్తుపళ్ళు, కొద్దిగా గూని. అతన్ని చూస్తే ఎవరికయినా అసహ్యం కలుగుతుంది.అతనికున్న స్వచ్ఛమైన శంక – ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్.

"ఒకప్పుడు ఆస్తిపాస్తులు అంతగా లేవు. ఓ అయిదువేల రూపాయలతో బిజినెస్ స్టార్ట్ చేశాను. అప్పుడే మా అక్కయ్య కూరుతు మీనాక్షిని నన్ను పెళ్ళి చేసుకుంటావా అని అక్క అడిగింది. మీనాక్షి అందుకు ఒప్పుకుంది. కానీ... ఆరోజు సంఘటన ఇప్పటికేకాదు. ఎప్పటికీ మరువలేను. "

"బావా నన్ను నిజంగా పెళ్ళిచేసుకుంటావా?"

"నీకు ఇష్టమయితే."

"నాకు ఇష్టంలేకపోతే పెళ్ళి చేసుకోవా?"

"ఇది కేవలం నా ఒక్కడి సమస్యకాదు మీనా. మన ఇద్దరి సమస్య."

"అయితే చెప్పేది విను బావా. నీ ముఖాన్ని నీవు అద్దంలో చూసుకో. నీ గొప్ప అందానికి మార్కులు వేసుకో. అప్పుడు పెళ్ళి చేసుకుంటాను అను."

"మీనా!"

"సారీ. బావా నీలాంటి వాణ్ణి పెళ్ళిచేసుకుని భర్త అంటూ నలుగురికి చెప్పలేను. నేను మదన్‌ని ప్రేమించాను. అతను నీకంటే వెయ్యిరెట్లు అందగాడని అతణ్ణి చూస్తే అనుకుంటావ్. మనిషి మగజీవిగా ఉంటే చాలదు బావా. అందం లేకపోతే మనిషయినా ఒక్కటే. చింపాంజీ అయినా ఒక్కటే."

"ఆ మాటలు తూటాలుగా నా గుండెలో గుచ్చుకుపోయాయి. ఆ తరువాత నాపై నాకే అసహ్యం కలిగింది. అదృష్టంకాని, ఏదయినా కాని వ్యాపారంలో లక్షలు గడించాను. కాని, అందాన్ని గడించలేకపోయాను" వాణీనాథం చెప్పడం ఆపాడు.

వసుంధర ముఖంలో రకరకాల మార్పులు కనిపించసాగాయ్. వాటిని గమనించటంలేదు వాణీనాథం. ఒక సిగరెట్ వెలిగించాడు.

"రేపు మీనాక్షి వస్తుంది. అయితే నే చేసిన పొరపాటేమిటంటే ఒకసారి మీనాక్షి ఫోనులో మాట్లాడుతుంటే, నిన్ను మించిన అందమయిన అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాను అన్నాను. ఆమె ఎవరో చూస్తానంది. రేపు మీనాక్షి నా భార్యను చూడాలని వస్తోంది. నేనే నిన్ను కోరుకున్నాను అనేకంటే, నీవే నన్ను కోరుకున్నావని చెప్పాలి. నన్ను ఈ ప్రపంచంలో ఎవ్వరూ ప్రేమించలేరని తెలుసు. అయినా అందమయిన అబద్ధంతో నన్ను ప్రేమించాననాలి. నేను డబ్బిచ్చి నిన్ను శాసించటంలేదు. అర్థిస్తున్నాను" వాణీనాథం కళ్ళు చెమ్మగిల్లాయి.

అది వసుంధర గమనించగలిగింది.

"మీనాక్షి నా ఇంటికి కాదు. మనింటికి వస్తుంది. ఆమెతో నీకంటే అందమయిన ఆత్మ సంస్కారంగల అమ్మాయిని పెళ్ళిచేసుకోగలిగాను అంటాను. ఆమె ముఖం ఎన్ని రంగులు మారుతుందో నాకు తెలుసు. పదిరోజులు భార్యగా నటించు. ఆ తరవాత నీ దారి నీది.. నీ వృత్తి నీవు చేసుకోవచ్చు."

వాణీనాథం అల్మరా తెరిచాడు.

మాంగల్యం ఆమె చేతికిచ్చాడు. "భారత స్త్రీకి అతిముఖ్యమయింది కట్టుకో" అతని గొంతు తడబడుతూ ఉంది. వసుంధర వణికే చేతితో మాంగల్యం అందుకుంది.

ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

వసుంధరను వెంటబెట్టుకుని ఇల్లంతా చూపించాడు. ఆ విశాల బవనంలో ఎలా ఉండాలో వివరించాడు. వంటగదిని చూపించాడు. వంట మనిషిని పరిచయం చేశాడు.

ఆ రాత్రి తెల్లవారింది.

వాణీనాథం బెడ్‌మీద నుండి బద్ధకంగా వళ్ళు విరుచుకుని ముడుచుకుని పడుకున్నాడు.

"ఏమండీ ఏమిటా మొద్దు నిద్ర. బెడ్ కాఫీ తీసుకోండి" అంటూ తట్టి లేపింది.

వాణీనాథం కళ్ళు తెరిచి విస్తుపోయాడు.

'ఎంత అందంగా ఉంది' మనసులో అనుకున్నాడు.

"ఏమండీ లేచి డ్రెస్ చేసుకోండి. మన ఇంటికి బంధువులొస్తున్నారు. ఈ అవతారంతో ఉంటే ఎలా? హుందాగా శ్రీమాన్ వాణీనాథ్‌లా ఉండాలి కమాన్" అంటూ హడావుడి చేస్తుంటే వాణీనాథానికి మతిపోయింది.

అంతలోనే క్రింద కోలాహలం వినిపించింది.

వసుంధర క్రిందకు వెళ్ళింది.

వాణీనాథం తలుపు తీసి చూశాడు. మీనాక్షి, ఆమె భర్త హాలులో ఉన్నారు. వసుంధర నిండుగా పైట కప్పుకుని వారి ముందుకు వెళుతూంది. ఏం మాట్లాడుతుందో?

"హలో... మీనాక్షి అనుకుంటాను. నమస్తే. నా పేరు వసుంధర. వారింకా లేవలేదు. అందుకే పరిచయం చేసుకోవలసిన శ్రమ నాకు కలిగింది."

"మా వారు.. మదన్" అంది మీనాక్షి.

"నమస్కారమండి. మీ ఇద్దరి గురించి వారు చాలాసార్లు చెప్పారు. మిమ్మల్ని చూసే భాగ్యం ఇప్పటికి కలిగింది. కూర్చోండి. తాయారమ్మా కాఫీ తీసుకురా"

'ఏమండీ చుట్టాలొచ్చారు ' అంటూ హడావిడి చేసింది వసుంధర.

మీనాక్షి విస్తుపోయి చూసింది.

వాణీనాథం బరువుగా ఊపిరి పీల్చాడు.

స్నానం ముగించి వస్తుంటే "ఏమిటండీ రాకరాక వచ్చారు కదా. అంతా లేటేనా? మాట్లాడుతూ ఉండండి. టిఫిన్ అరేంజ్ చేస్తాను. "

“మీనా, మదన్‌గారూ బాత్‌రూం అక్కడ స్నానం చెయ్యండి. ఏమండీ ఇంట్లో చుట్టాలున్నారు. ఛెయిన్ స్మోక్ చేయకండి. వారికి ఇబ్బంది కలగవచ్చు. తాయారమ్మా మార్కెట్‌కి వెళ్ళి ఫిష్, మటన్ తీసుకురా" తనే ఇంటందరికీ ఆర్డర్స్ జారీ చేసింది.

వాణీనాథం మనసు పొంగిపోయింది.

వసుంధర వెళ్ళాక మదన్ అన్నాడు "చాలా మంచి అమ్మాయ్"

వాణీనాథం అదోలా నవ్వి, మీనాక్షితో తమ పెళ్ళి గురించి, కుటుంబ పరిస్థితులు గురించి మాట్లాడాడు.

టిఫిన్ చేస్తున్నప్పుడు వసుంధర అంది. "ఏం మీనా? మీ అమ్మగారు పోవటంతో అన్ని బంధాలు తెంచుకున్నావ్. బావ అంటే ఎవరు? అమ్మ తరువాత అంతటివాడు వస్తూ, పోతూ ఉండొద్దూ. ఏమండీ మదన్‌గారూ?"

"ఇలాంటి చెల్లెలు ఉందంటే వచ్చేదాన్నే" అంది మీనాక్షి నవ్వి.

మధ్యాహ్నం భోజనాలప్పుడు మీనాక్షి మదన్‌ల కంటే వాణీనాథానికే వింతగా అనిపించింది. ఈ వంట తాయారు చేసింది కాదు. ఖచ్చితంగా వసుంధర చేసి ఉండాలి అనుకున్నాడు.

మరునాడు మీనాక్షి వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతూ చిత్రమయిన ఒక వ్యాఖ్యానం చేసింది "బావా! నువ్వంటే ఒకప్పుడు నాకు ఎలర్జీ. జీవితంలో నీమీద పెంచుకున్నంత ఎలర్జీ ఎవరిమీద నేను చూపలేదు కాని. ఇప్పుడు నిన్ను చూస్తుంటే జెలసీ కలుగుతోంది. అందుక్కారణం వసుంధర."

మీనాక్షి వెళ్ళిపోయింది.

ఆమె అన్న మాటలు అతని మనోఫలకంపై నుండి చెరిగిపోలేదు. వసుంధర గృహిణిగా ఒక అంతస్తులో నిలిచి, తనను నిలిపింది.

పదిరోజులు గడిచాయ్.

వసుంధర బయలుదేరింది."నా గడువు పూర్తి అయింది. నేను వెళ్ళిపోతున్నాను" అంది.

వాణీనాథం అదోలా చూశాడు. "వసూ! నీవు ఎవరివయినా నా భార్య స్థానంలో ఉండి, భార్య ఇలా ఉండాలని చాటావు. ఎవరు ఏమన్నా నీవు శాశ్వతంగా నా భార్యవు. నా భార్యగా నిన్ను స్వీకరిస్తాను" అన్నాడు.

వసుంధర విస్తుపోయింది. కళ్ళలో నీళ్ళు నిండాయి.

వాణీనాథం పాదాలపై వాలిపోయింది.

COMMENTS